# జానకి విజయం

సాయంత్రం అయిదు దాటింది. చల్లని గాలి నరాల్ని కొరికేస్తోంది. మిస్ జానకి చేతుల మీదుగా చీర చెంగు కప్పుకుని వయ్యారంగా నడుస్తోంది. ఆ నడకలో నవ నాగరికత ప్రస్ఫుట మౌతోంది.

"నమస్తే జానకిగారూ" వెనుక నుండి యెవరో పలుకరించినట్టయ్యింది.

వెనుదిరిగి చూసింది జానకి.

సైకిలు దిగుతూ శేఖరం ప్రత్యక్షం.

అతణ్ణి చూశాక ఆమెలో యే విధమైన మార్పూ రాలేదు.

"నమస్తే" నిర్లక్ష్యంగా అనేసి మళ్ళీ ముందుకు సాగిపోయింది.

అంత సులువుగా వదిలిపెట్టే వ్యక్తి కాదు శేఖరం. ఆమెతో సరిసమంగా నడక సాగించాడు.

తనకి సమానాంతరంగా అతను నడుస్తూ వుండటం జానకికి చిరుకోపం కలిగించింది. ఓమారు అతనివేపు తీక్షంగా చూసింది. అబ్బే! అతను చలించలేదు.

"మీకు యెన్నిసార్లు చెప్పినా, బుద్ధిలేదేమండీ?" అంది విసుగ్గా.

"అంటే, మీ వుద్దేశం?" తెల్లబోయాడు శేఖరం.

"నా వెంటపడొద్దని మీకు యెన్నోసార్లు చెప్పాను. మంచి మనిషికి ఒక మాటచాలును గాని, మీకు..."అని పూర్తి చేయటం యిష్టంలేక గొణిగేసింది.

"పూర్తి చెయ్యండి. నా బలహీనతకు మీరేమన్నా ఒప్పుకు తీరాల్సిందే," అన్నాడు శేఖరం.

లెంపకాయ కొట్టినవాడికి, రెండో చెంప అందించితే, అతను యే విధమైన అనుభూతి పొందుతాడు? అలా వుంది జానకి పరిస్థితి అతని అమాయకత్వం చూసి జాలిపడింది.

"మిమ్మల్ని చూస్తే నాకు జాలివేస్తుందండీ! కాని, యిలా మీరు వృధాగా నా కోసం పరితపించడం యెందుకు చెప్పండి?" అంది.

ఆమె ఒక దోవన పడుతున్నట్టనిపించి మురిసిపోయాడు శేఖరం.

"మీకు మాత్రం తెలీదా? మీ దివ్యసుందర విగ్రహాన్ని యేనాడో నామనఃఫలకంపై చిత్రించుకున్నాను. మీ హృదయంలో నాకు కాస్త చోటు యివ్వమని యెన్నాళ్ళనుంచో అర్థిస్తున్నాను. అలాంటి మిమ్మల్ని మర్చిపోవడమెలా చెప్పండి?" అన్నాడు.

"మీ కంటికి, నేనంత అందంగా అగుపిస్తున్నానా?"

"దివి నుండి భువికి దిగివచ్చిన అప్సరసలా అగుపిస్తున్నారు. నాకలల్ని యథార్థం చేసే భారం మీదే, నా ప్రేమను త్రోణీకరించకండి"

నలుగురూ సంచరించే రోడ్డు మీద యీ ప్రణయ వేదన వినటం జానకికి సుతరామూ యిష్టం లేదు.

"చూడండీ! ఇది నిర్జనప్రదేశం కాదు. నలుగురూ తిరిగే బాట. ఇక్కడ ప్రణయం గురించి మీరు వల్లెవేయటం సభ్యతగాలేదు. అదీగాక, వున్న విషయం చెపుతున్నాను... పెళ్లి చేసుకోవటంలో నాకు కొన్ని ఆదర్శాలున్నాయి..." అంది జానకి.

"మీ ఆదర్శాలేవిటో చెప్పండి. మీ ఆదర్శాలకు అనుగుణంగా సంచరిస్తాను..." అన్నాడు శేఖరం వుత్సాహంగా.

మద్దంశెట్టి
హనుమంతరావు

జానకి చిన్నగా నవ్వింది.

"కాస్త మెల్లిగా మాట్లాడండి...నిజంగా మీరు చాలా అమాయకుల్లా వున్నారు. చూడండీ, నా ఆశయం ఒకే ఒక్కటి...ఏమిటీ అంటే, నేను పెళ్ళాడబోయే వ్యక్తి ధనికుడై వుండాలి" అంది అతని మొహంలోకి చూస్తూ.

శేఖరం స్తంభించి పోయాడు. ఆమె ఆశయం ప్రకారం చూస్తే, ఆమెను వివాహం చేసుకుందుకు తనకు అర్హత లేదు. తను ధనికుడు కాదు...కేవలం సామాన్యుడు!

"ఏవిటలా ఆలోచిస్తున్నారు?" అందామె చిలిపిగా నవ్వుతూ.

"ఏంవి లేదు లెండి. మీరీ ఆశయం పెట్టుకోవటంలో అర్థం లేదనుకుంటాను. మీకు యే లోటూ కలిగించకుండా చూసే వ్యక్తి లభిస్తే చాలదూ? నాకు 'నా' అన్నవాళ్ళెవరూ లేరు. బాధ్యతలంటూ యేమీ లేవు. మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి పూజిస్తాను...నా మాట నమ్మండి," అన్నాడు.

"మీకు యే మాత్రం ఆస్తిపాస్తులున్నాయి?" ప్రాసిక్యూటరు ప్రశ్నలావేసింది.

"ఒక యిల్లు తప్పించి మరేమీ లేదు. కాని, మంచి వుద్యోగం నెలకి నూటయాభై రూపాయిలు సంపాదించుకుంటున్నాను. పోస్టలు సేవింగ్సులో ఓ వేయిరూపాయిల వరకూ వుంటుంది"

"ఇంతేనా!" తేలిగ్గా అనేసి "అవుతే,నా ఆశ విడిచిపెట్టుకోండి" ఖచ్చితంగా చెప్పేసింది జానకి.

ఆమె ధోరణి శేఖరానికి చెప్పలేని వుద్రేకం కలిగించింది. ఆమె హృదయంలో మార్దవం అసలువుందా? అనిపించింది. కోపాన్ని ఆపుకోలేకపోయాడు.

"ధనికుణ్నే పెళ్ళాడాలని పట్టుబట్టారు కదా, మీరు ధనవంతులేనా?" కసిగా అనేశాడు.

హఠాత్తుగా వచ్చిన యీ ప్రశ్నకి జానకి చిరుకోపంతో అతనివేపు చూసింది.

"ఈ ప్రశ్న అడిగేందుకు మీకు అధికారంలేదు. అయినాసరే, చెప్తాను. నేను పేదదాన్నే! అవుతేనేం—నాలో యౌవనం, అందం, ఆకర్షణ, వున్నయ్. నాకున్న ఆస్తిపాస్తులు అవేను. ఇంతవరకూ ఆర్థికంగా నేనెంత యిక్కట్లుపడ్డానో, భవిష్యత్తులో అంతగా సుఖపడాలని నా వాంఛితం. నా భావం యిప్పటికైనా అర్థంచేసుకొని వుంటారనుకుంటాను..." అంది.

"చూడండీ, మీ అభిప్రాయం బాగానే వుంది. భవిష్యత్తులో సుఖాన్ని ఆశించడం మానవసహజం. నేను మిమ్మల్ని సుఖపెట్టగలననే నమ్మకం నాకుంది. మీకు యే లోటూ రానివ్వను..."

"ఎందుకు వృథాప్రయాస శేఖరంగారూ! నా కోరికలు మీరందుకోలేరు" అంది చిన్నగా నవ్వుతూ.

"అవేవిటో చెప్పండి..." మహా ధైర్యంగా అడిగాడు.

"చెప్పనా!...నాకో కారు వుండాలి. ఎప్పుడూ కారుమీద తిరగాలని అభిలాష. ఉండే యిల్లు సామాన్యమైనది కాకూడదు. కనిసం రెండంతస్తులమేడ అయివుండాలి. నౌకర్లూ, చాకర్లూ, విరివిగా వుండాలి. అన్నీ నేను వల్లించడమెందుకూ? ఈ హోదాలో వుండాలంటే, తిరిమ్మాకవన్నీ

# కాల్గేట్‌కు నిదర్శనమున్నది!

# కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో

ఒకే ఒకసారి తోముకుంటే



## దంతక్షయానికి కారణమైన క్రిములను నూటికి 85 వంతులు అది తొలగిస్తుంది

— ఋజించివవెం టనే కాల్గేట్‌తో దంతములను తోముకోవడంవల్ల దంత క్షయాన్ని ఎక్కువగా చాలా మందికి అరికట్టును. దంత శాస్త్ర చరిత్రలో మరి ఏవి ఇట్టి గుణము యిచ్చినట్లు ప్రచురింప బడలేదు.



## దుర్గంధాన్ని ఆపుతుంది తక్షణమే

— 10 మంది మీద జరిపిన శాస్త్ర పరిశోధనలవలన అందులో 7 గురికి నోటి దుర్గంధాన్ని కాల్గేట్ తక్షణమే పోగొట్టినట్లు రుజువైంది.



## ప్రజలందరికి హితవైనది

— దేశమందంతటా విరివిగా వాడ బడుచున్న ముఖ్యమైన టూత్ పేస్టులలో కాల్గేట్ మార్కు గలవే ఎక్కువ హితవుగానుండి ప్రజాదరణ పొందుచున్నట్లు తెలుస్తున్నది.

కాల్గేట్ ఒక్కటే ఈ మూడింటిని చేస్తుంది! దంతములను పరిశుభ్రము చేస్తూనే దుర్గంధాన్ని నివారించి, దంత క్షయాన్ని నిరోధిస్తుంది!

ఇండియాలో విశేషంగా అమ్మకమౌతున్న టూత్ పేస్టు!




ఎకానమీ సైజు కొనండి— ఆదా చేసుకోండి.

సళ్ళలితాలకు కాల్గేట్ టూత్ బ్రష్‌నే ఎల్లప్పుడూ వాడండి


# జానకి విజయం

యెలావుండాలో వూహించుకోండి..." అంది మెల్లగా.

శేఖరం నిరుత్తరుడై పోయాడు. ఆమెపై అంతులేని కోపం ముంచుకొచ్చింది. క్షణం క్రితంవరకూ అతనిలోవున్న ప్రేమంతా తుడుచుకుపోయింది. ధనవ్యామోహంలోవున్న వ్యక్తిలో ప్రేమ యెలావుంటుంది? అసలు ప్రేమంటే వారికి అర్థంకూడా తెలీక పోవచ్చు...అనుకున్నాడు.

"మీరు కేవలం ధనాన్నే జీవిత సర్వస్వంగా భావిస్తున్నారు.. అందుకే, మీకు ప్రేమతత్వం బోధపడలేదు. నేను యెంత గాఢంగా మిమ్మల్ని ప్రేమిస్తున్నానో, మీకు తెలీదు. ధనవ్యామోహంలోపడిన వాళ్ళను ప్రేమించడంకూడా తప్పే నేమో! కాని, ఒక్కటిమాత్రం జ్ఞాపకముంచుకోండి. మీరు ఆకాశహర్మ్యాలు నిర్మిస్తున్నారు. అవన్నీ నిజమౌతాయో, లేదో ఆలోచించుకోండి." అన్నాడు శేఖరం ఆవేశంతో.

"మీరే చూస్తారుగా!" నిర్లక్ష్యంగా, ముక్తసరిగా అంది జానకి.

"కాని మీరు సుఖపడలేరు." శేఖరంలో వుడుకుమోత్తనం ఒకపాలు పెరిగింది.

"అది మీ భ్రమ. సుఖాన్ని ధనంతో కొనేస్తాను. నే నేం తెలివిమాలినదాన్ని కాదు" నవ్వుతూ అంది.

"ఇదె మీ ఆఖరి నిశ్చయమా?"

"ఔను...ఇకనైనా మీరు నన్ను విసిగించకండా వెళ్ళండి" అంది జానకి.

"అబ్బే, మిమ్మల్ని నేనెందుకు విసిగిస్తాను? అసలు నాకా అధికారమే లేదు గా! మీరు నన్ను తృణీకరిస్తున్నందుకు నాకేమీ విచారంలేదు గానీ, మీ ఆశయం యెంతవరకు నెఱవేరుతుందో చూడాలనివుంది" కసిగా అనేశాడు శేఖరం.

జానకి గర్వంగా నవ్వింది.

"అలాగే చూడొచ్చు" అంది ముక్తసరిగా.

తను ఓడిపోయినట్టుగా బాధపడ్డాడు శేఖరం. మారుమాటాడకుండా సైకిలెక్కి పోయాడు. జానకి నవ్వుకుంది.

* * *

క్యాలండర్ల పుటలు యెన్నో మారాయి. అప్పుడప్పుడు శేఖరం, జానకి ఒకరికొకరు తారసపడినా మాట్లాడేవారుకాదు. జానకిమాత్రం చిన్నగా నవ్వేది. ఆ నవ్వు శేఖరం గుండెల్ని చీల్చుకుపోయేది. నవ్వలేక పోయేవాడు.

ఇటీవల శేఖరానికి జానకి అగుపించడం లేదు. ఉద్యోగం మానివేసిందేమో ననుకొన్నాడు.

ఒకరోజు స్నేహితుడొస్తున్నాడని స్టేషనుకి వెళ్ళాడు శేఖరం. ఆ స్నేహితుడు రాలేదు. కాని, చాలరోజుల్నుండి కనిపించని జానకి అప్సరసలా అగుపించింది. ఆమెను చూసి చాలా ఆశ్చర్యపోయాడు శేఖరం.

ఆమెలో యెంతో మార్పువచ్చింది. ఆమె ధరించిన దుస్తులు మంచి ఖిలువైనవి. చేతికి రిస్టువాచీ, చేతిలో వానిటీబాగ్, ఒహ్ శేమిటి...చాలా నవనాగరికంగా అగుపించింది. తదేకంగా ఆమెవేపు చూశాడు. ఆమె జానకేనా? లేక ఆమెనుపోలిన మరో స్త్రీయా? అన్న సందిగ్ధతలో పడిపోయాడు...సరిగ్గా అదేసమయానికి, "హల్లో మిష్టర్ శేఖరం" అందామె చిరునవ్వుచిందిస్తూ.

ఆమె జానకేనని నిర్ధారణ చేసుకుందుకు శేఖరానికి అట్టేసేపు పట్టలేదు. ఆమెవేపు వింతగా చూడ్డం ప్రారంభించాడు. జానకి అతనికి కొంత దగ్గరగా వచ్చింది. ఆమె వెంట ఓ కూలివాడు సామానుతో వున్నాడు.

"నన్ను చూస్తుంటే మీకు ఆశ్చర్యమేస్తుంది కదూ! నిజమే మరి ఇప్పుడు నేను ఒక లక్షాధికారి భార్యను. పెద్ద మూడంతస్తుల మేడ. రెండు కొత్తకార్లు, అడుగడుగునా నౌకర్లూ, క్లబ్బులూ, పార్టీలూ...ఓహ్ ఒకటేమిటి? ఆ రోజు మీరన్నారు జ్ఞాపకముందా, నేను గాలిమేడలు కడుతున్నానని ఇప్పుడేమంటారు?" ముసిముసి నవ్వులు ఒలకబోసింది. పెదాలకు పూసుకున్న లిప్‌స్టిక్ తళుక్కుమంటోంది.

శేఖరం నిజంగా నీరైపోయాడు.

"ఆ లక్షాధికారి యెవరో తెలుసుకోవచ్చునాండి?" అన్నాడు మెల్లగా.

"అదిగోండి అక్కడ యెవరితోనో మాట్లాడుతున్నారు, చూడండి. మీకు తెలిసే వుంటుంది. కామరాజుగారని పెద్ద వ్యాపారస్తులు" అంటూ వెనక్కి తిరిగి చూపించింది.

శేఖరం కామరాజుని చూశాడు. అతని ఆశ్చర్యానికి అంతులేకపోయింది. అతను యెట్లా యీమె వలలో యిరుక్కున్నాడా అని నివ్వెఱపోయాడు.

"నిజంగా మీరు అదృష్టవంతులండీ! అన్నట్టుగానే సాధించారు. ఇంతకీ మీ యిరువురికీ పరిచయం యెలా యేర్పడిందో తెలుసుకోవచ్చునా? ఇది నా తలకుమించిన ప్రశ్న అనుకోండి. అయినా తెలుసుకోవాలని వుంది."

జానకి నవ్వింది.

"చూశారా నా అంతస్తు పెరిగే సరికి మీరు అంతరం తెలుసుకొని మాట్లాడ్డం ప్రారంభించారు. అసలు విషయానికివద్దాం. నేను మిస్ట్రెస్‌గా పనిచేస్తుండేదాన్నని మీకు తెలుసుగా. మా స్కూల్లో ఫంక్షను జరుగుతున్న సందర్భంలో, ఆయన దగ్గరకి విరాళంకోసం వెళ్ళాం. అధిక విరాళం ఆయనే యివ్వటంవల్ల, ఆయన చేతనే ప్రారంభోత్సవం జరిపించాం. ఇదీ మా పరిచయానికి నాంది. తొలిచూపులు వేళావిశేష మేమోగానీ, ఆయన నన్ను మర్చిపోలేకపోయారు. అందుకే తన పిల్లలకు ప్రయివేటు చెప్పేందుకు నన్నే నియమించారు. నేనూ కాదనలేకపోయాను. అతని చూపుల్లో చేష్టల్లో, అసలు విషయం గ్రహించగలిగిన నేను అదను జారవిడుచుకోకూడదనుకొని యిలా ఒప్పుకొన్నాను. అంతే! కొద్దిరోజులు గడిచాక ఆయింటి యిల్లాలినై కూర్చున్నాను" వుత్సాహంగా నవ్వుతూ చెప్పింది జానకి. ఆమె ప్రతీమాటలోనూ గర్వం తొణికిసలాడుతోంది.

"అతనికి భార్యలేదా అప్పటికి?"

"చనిపోయిందట"

"బాగానే వుంది కాని, ఒక్కటిమాత్రం ఆలోచించారా?".

"ఏమిటి?"

"అందచందాల్లో, వయస్సులో, యెందులో చూసినా అతను మీకు తగిన భర్త కాడు. అది మీరు ఒప్పుకోవాలి. ఏమంటారు?"

జానకి బాధపడలేదు. కోపం తెచ్చుకోలేదు.

ఈ భేదాలన్నీ పుస్తకాల్లో రాయడానికే వుపకరిస్తాయండీ! నిత్యజీవితంలో వీటికోసం చూశామా, ఓటమి తప్పదు. అవకాశం చిక్కిందంటే చాలు, అన్నీ అనుభవించడానికే ప్రయత్నించాలి. అన్నింటికి మించింది డబ్బు! డబ్బుంటే అన్నీ సర్దుకుపోతాయి. హోదా, గౌరవం, పరపతి, యివన్నీ డబ్బుతోనే వస్తాయి. మీరలా అనాలని అంటున్నారేగానీ, నాకు ఆ విచారమే లేదు. జీవితం, మూడు పువ్వులూ, ఆరు కాయలుగా సాగిపోతోంది...అ అదిగోండి ఆయనా వచ్చేస్తున్నారు.. పరిచయం చేస్తానుండండి..." అంది జానకి.

ఆమె ధోరణిచూసి తనని అవమానపర్చేందుకే ఆమె అలా ప్రవర్తిస్తోందనుకున్నాడు శేఖరం.

"అబ్బే గొప్పవారితో పరిచయాలు మాలాంటి సామాన్యుల కెందుకు లెండి. వస్తా" అంటూ ముందుకి సాగిపోయాడు శేఖరం.

జానకి గర్వంగా నవ్వుకుంది. అప్పుడే కామరాజువస్తూ,

"అతనెవరు జానీ?" అన్నాడు.

"మా స్నేహితుడులెండి. ఓ మారు అతనికీ, నాకూ వివాదం వచ్చింది. నేను డబ్బున్న వ్యక్తినే వివాహం చేసుకుంటానని చెప్తే, పరిహాసంగా నవ్వేశాడు. అందుకే యిప్పుడతనలా వెళ్ళిపోతూవుంటే, పిల్చి మరీ చెప్పాను. ఇక చూసుకోండి. అతని అసూయ..." నవ్వుతూ అంది.

## "సింపుల్!"

మంత్రిగారు: నేనో బ్రహ్మాండమయిన ట్రిక్కు నేర్చుకున్నా: అమాంతం గాలిలోంచా అన్నట్టు 200 చుట్టలు చేతిలోకి తెప్పిస్తా. అన్నీ ఒకే మారు చిటికివేసి వెలిగించి ప్రతీ ఒక్క చుట్టనీ ఒకోదమ్ములాగి మొత్తం రెండొందలు చుట్టల్నీ మింగేస్తా.

స్నేహితుడు: హోరి మీ! ఎలా చేస్తారండీ! ఆశ్చర్యం!

మంత్రిగారు: సింపుల్! మా మేనమామకి చుట్టల వ్యాపారం వుందిలెండి. అక్కడనుంచి టోకుగా తెప్పించుకుంటా చుట్టలు.

"అందమైన అమ్మాయిల్ని చూస్తే యిప్పటి యువకులు పళ్ళికిలిస్తారు. కాని డబ్బు తోడుగా లేనిదే అందానికి శోభ రాదని వాళ్ళకి తెలీదు పాపం: మాట వరుసకు నిన్నే తీసుకుందాం. ఒక సామాన్యుని భార్యవైతే నువ్విలా వుంటావా? వంటగదిలో వూపిరి తిరగనివ్వని పొగలో వుక్కిరిబిక్కిరవుతుండే దానివి. ఇప్పుడు మాడు— అచ్చంగా అప్సరసలానే వున్నావు"? అని నవ్వుతూ ఆమె భుజమ్మీద చేయివేశాడు.

"మీరు మరీను" సిగ్గుపడిపోయింది జానకి.

ఇద్దరూ గేటుదాటి బైటపడ్డారు. కారు రెడీగా వుంది. సామానువెనక వేయించి యిద్దరూ కారులో కూచున్నారు. కారు బుర్రుమంటూ సాగిపోయింది. కొంత దూరంలో నిల్చుని సిగరెట్ ముట్టిస్తున్న శేఖరం కసిగా గొణుక్కున్నాడు.

"ఛీ! ధన వ్యామోహం ఎంతయినా చేయిస్తుంది."

★


## చందా వివరములు

ఆంధ్ర దినపత్రిక

| (ఆదివారపు సంచికతో సహా) | | రూ. | [నయా పైసలు] |
|---|---|---|---|
| సంవత్సర చందా | ... | 28 | 00 |
| అర్ధ సంవత్సర చందా | ... | 14 | 00 |
| 3 మాసముల చందా | ... | 7 | 00 |
| నెల చందా | ... | 2 | 50 |
| విడిప్రతిసాధారణదినములలో | ... | ,, | 7 |
| ఆదివారపు దినపత్రిక | ... | ,, | 18 |

ఆంధ్ర పత్రిక — మద్రాసు-1.